క్లుప్తంగా

రేపు అమరావతి తెలుగు వెలుగులు పురస్కారాలు ప్రదానం

నగరంపాలెం: అమరావతి తెలుగు వెలుగులు పురస్కారాల ప్రదానోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు యువకళావాహిని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంక లక్ష్మీనారాయణ, మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సహస్ర పూర్ణచంద్ర దర్శన సందర్భంగా యువకళా వాహిని ఆధ్వర్యంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఉత్సవాల్లో భాగంగా పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహించనున్న కార్యక్రమంలో రంగస్థల నటులు, దర్శకుడు తాళాబత్తుల వెంకటేశ్వరరావు, నాట్య గురువు డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, రచయిత షేక్ అబ్దుల్‌హకీం జానీ, వ్యాఖ్యాత సరస్వతిప్రాసరత్న ఏవీకేసుజాత, సంగీతంలో ఎంవై.శేషురాణిలకు పురస్కార ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ

నెహ్రూనగర్: మాల కొండ శ్రీలక్ష్మీ నరసింహా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరండల్‌పేటలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు సురేష్ చౌదరి మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత



నగరంపాలెం: జిల్లా ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వర్తించే ఏఆర్ ఎస్‌ఐ ప్రసాద్‌రావు, కానిస్టేబుళ్లు లూదియరావు, సోమేశ్వరరావు, ఏపీఎస్‌సీ డీసీఎల్ హోంగార్డు జయదాస్‌అనారోగ్య కారణాలతో వేర్వేరు నెలల్లో మృతిచెందారు. ప్రసాదరావు భార్య రమ్యకృష్ణకు అదనపు కార్పస్ ఫండ్ లక్ష రూపాయలు, లూదియరావు భార్య మేర్సీగ్రేసికి రూ.1.75 లక్షలు, సోమేశ్వరరావు భార్య మాధవికి రూ.1.75 లక్షలు, హోంగార్డు జయదాస్ భార్య శాంత కుమారికి రూ.10 వేల చెక్కులను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ వెంకటేశ్వర్లు, సూపరిం టెండెంట్ రమాదేవి, పోలీస్ సంఘం సభ్యులు హుస్సేన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



గుంటూరు మెడికల్: అవకాశాలు మనదగ్గరకు రావని, వాటిని మనమే సృష్టించుకుని వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. బుధవారం మంగళగిరి కేఎల్ యూనివర్సిటీలోని పీకాక్ హాలులో కేఎల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్(కెఎల్ ఐపీఎఫ్ సీ), కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి లెవెల్ ఐపీ ఉమెన్ బిజినెస్ సమ్మిట్–2024 నిర్వహించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ చిన్న వ్యాపారమైన సరే దానిలో ఎంత ఫండింగ్ రాబట్టాలి అనే ఒక ప్రణాళిక ద్వారా ముందుకు అడుగులు వేస్తే ఆ వ్యాపారం విజయవంతం అవుతుందన్నారు. ఒక సాధారణ హాస్పిటల్‌గా ప్రారంభమైన హోప్ విన్ హాస్పిటల్ నేడు ప్రజాదరణ పొందిన విధానాన్ని గురించి వివరించారు. మైక్రోస్మాల్ మినీ ఎంటర్ ప్రైజెస్ గురించి వివరించారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను అభినందించిన పెన్షనర్స్ అసోసియేషన్



గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మన రాష్ట్రం తరఫున పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. బుధవారం జెడ్పీ ప్రాంగణంలోని క్యాంపు కార్యాలయంలో హెనీ క్రిస్టినాను కలసిన అసోసియేషన్ నాయకులు ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. ఈసందర్భంగా సంఘ కార్యదర్శి పి.నాగరాజు మాట్లాడుతూ రెండున్నరేళ్ల కాలంలో చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రి కాపలాదారుల నియామకంతో పాటు టెన్త్ విద్యార్థులకు విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పెన్షనర్ సంఘ నాయకుడు ఎం. నరసింహమూర్తి, శ్రీనివాసరావు, రాంబాబు, ఎంఎస్ నాగేంద్ర, జి.రామకృష్ణ పాల్గొన్నారు.



జిల్లా కోర్టు ఆవరణలో తాగునీటికి కష్టాలు

- పనిచేయని తాగునీటి చలివేంద్రం
- శుద్ధిచేసిన తాగునీటి సీసాలు కొనాల్సిన దుస్థితి

నగరంపాలెం: వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలో తాగునీటి సరఫరా లేదు. దీంతో పలు కోర్టులకు వచ్చే కక్షిదారులు, వారి సహాయకులు, పలువురు గుక్కెడు నీటి కోసం అల్లాడిపోతున్నారు. తాగేనీరు అందుబాటులో లేకపోవడంతో డబ్బులు వెచ్చించి, మంచినీటి సీసాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

ప్రయోజనం శూన్యం..

గుంటూరు నగరంపాలెంలోని జిల్లా కోర్టులో సుమారు 26కిపైగా కోర్టులు ఉన్నాయి. న్యాయమూర్తులు, న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు, కోర్టు అధికార సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు, వారి సహాయకులు వెరసి రోజుకి సుమారు ఐదు వేల మందికిపైగా వస్తారనేది ఒక అంచనా. 1964లో తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2005లో చలివేంద్రం పేరుతో అదే ప్రదేశంలో పునః ప్రారంభించారు. దాని ఇరు వైపులా ఐదు కొళాయిలను ఏర్పాటు చేశారు. దీంతో తాగునీటి కష్టాలు తీరాయి. కాలక్రమేణా అది కూడా మూలనపడింది. దీంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దాదాపు రెండేళ్లకుపైగా ఇదే పరిస్థితి నెలకొంది. మంచినీళ్లు ఎందుకు రావడంలేదని ఎవరూ పట్టించుకోవడంలేదు.



మంచినీళ్లు సరఫరా కాని కొళాయిలు..

గొంతెండుతోంది..

కక్షిదారులు, వారి సహాయకులు నీటి కోసం పడే ఇక్కట్లు మాటల్లో చెప్పలేనివి. ఉమ్మడి జిల్లాల నుంచి అత్యధిక మంది పలు కేసుల నిమిత్తం వస్తుంటారు. అంతేగాక కోస్తా జిల్లాల నుంచి వచ్చే వారు ఉన్నారు. ప్రస్తుతం వర్షకాలంలో కూడా ఉష్ణోగ్రతలు పెరగడంతో దాహార్తి తీర్చుకునేందుకు నానా అగచాట్లకు గురవుతున్నారు. దీంతో చాలామంది విడిగా మంచి నీళ్లను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి కి వచ్చే వారు రూ.10, రూ.20 తాగునీటి సీసాలు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

ఆర్‌ఓ ప్లాంట్ ఉంది..

తాగునీటి చలివేంద్రం పనిచేయడంలేదు. ప్రస్తుతం ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఆర్‌ఓ ప్లాంట్ ఉంది. తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం.

– కాసు వెంకటరెడ్డి, ది గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

నగరంలో బంద్ పాక్షికం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీ సంఘ నాయకులు



గుంటూరు జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలియజేస్తున్న ఎస్సీ సంఘ న్యాయవాదులు

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాల సంఘాలు, ఇతర సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ పిలుపులో భాగంగా గుంటూరు నిర్వహించి బంద్ పాక్షికంగా జరిగింది. తెల్లవారుజామున 5 గంటలకు మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద బైఠాయించి బస్సులను బయటికి రాకుండా అడ్డుకున్నారు. అనంతరం లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోళ్ల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీలను అణిచివేయాలన్నా హిందూ మత ఉన్మాద అగ్రవర్ణ రాజకీయ పార్టీలు సంవత్సరాలుగా రిజర్వేషన్స్ ఎత్తివేయాలన్నా వారి కుట్రలు ఆగస్టు 1న సుప్రీం కోర్టు తీర్పు ద్వారా వెలువడిందన్నారు. ఈ తీర్పు రావడానికి మందకృష్ణను పావులాగా కేంద్ర ప్రభుత్వ పెద్దలు వాడుకున్నారన్నారు. ఈ నెల 25న విజయవాడలో అన్ని మాల సంఘాల నాయకులు ప్రత్యేక సమావేశం కావడానికి తీర్మానించుకున్నామన్నారు. కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు దారా హేమప్రసాద్, విప్పర్ల భాస్కర్, బండ్లమూడి స్టాలిన్, నల్లపు నీలాంబరం, పిల్లి మేరి పాల్గొన్నారు.

నగరంపాలెం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని గుంటూరు బార్ అసోసియే షన్ దళిత న్యాయవాదులు డేవిడ్‌లూథర్‌బాబు, జీఎం.నాగేశ్వరరావు, క్రాంతి సుదర్శన్, వేముల ప్రసాద్ అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా బుధవారం గుంటూరు నగరంపాలెంలోని జిల్లా కోర్టు వద్ద నిరసన చేపట్టారు.

యూనివర్సిటీలో బంద్ ప్రశాంతం

ఏఎన్‌యూ: జాతీయ దళిత విద్యార్థి సమాఖ్య(ఎన్‌డీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పునకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టిన 'భారత్ బంద్'ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులు యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద వర్గీకరణకు వ్యతిరేకమైన నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్డీఎస్‌ఎఫ్ ప్రెసిడెంట్ రత్నసాగర్, వైస్ ప్రెసిడెంట్ రత్న కిషోర్, పరిశోధకులు పావన మూర్తి, పరిశోధకుడు బత్తుల హర్షవర్ధన్ పాల్గొన్నారు.

డోర్ టూ డోర్ సర్వే వేగవంతం చేయాలి

కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: స్పెషల్ సమ్మరీ రివిజన్– 2025 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టూ డోర్ సర్వేను బీఎల్‌ఓలు వేగంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరంలో ఇంటింటి ఓటరు సర్వే వేగవంతంపై బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సూపర్వైజరీ అధికారులు, బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరంలో స్పెషల్ సమ్మరీ రివిజన్– 2025 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టూ డోర్ సర్వేలో వేగం పెరగాలని, బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓట్ల సర్వే చేయాలన్నారు. సర్వేలో భాగంగా ప్రతి బీఎల్‌ఓ తమ పరిధిలోని ఓటర్ల లిస్ట్ పక్కాగా, సమగ్ర వివరాలతో ఉండేలా చూసుకోవాలన్నారు. బీఎల్‌ఓలకు యాప్, ఫారాల దరఖాస్తుపై ఎటువంటి అనుమానాలు, సందేహాలు వచ్చినా సంప్రదించడానికి ఎన్నికల విభాగంలో సిబ్బందిని కేటాయించుకోవాలని, బదిలీలు, ఇతర కారణాలతో ఖాళీ అయిన బీఎల్‌ఓల స్థానంలో వెంటనే మరో కార్యదర్శికి విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని ఎన్నికల విభాగ సూపరింటెండెంట్‌ని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.వెంకటలక్ష్మి, మేనేజర్ ప్రసాద్, ఎన్నికల సూపరింటెండెంట్ పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

అన్న క్యాంటీన్ల పరిశీలన

నెహ్రూనగర్: అన్న క్యాంటీన్లకు వచ్చిన వారికి ఆహారం అందించాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం చుట్టగుంట సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో అన్న క్యాంటీన్లకు పేద ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు.

అన్న క్యాంటీన్లకు రూ.25 వేల విరాళం

అన్న క్యాంటీన్ల నిర్వాహణకు గుంటూరు నగర రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు రూ.25 వేల చెక్కును నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకి బుధవారం కమిషనర్ చాంబర్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నగర అధ్యక్షులు నారాయణరెడ్డి, ట్రెజరర్ సాయిరాం, ఈసీ మెంబర్ సదాశివరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

కార్పొరేట్‌లకు వరాలు.. ప్రజలపై భారాలు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్

లక్ష్మీపురం: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు వరాలు కురిపిస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. నాలుగో డివిజన్ సీపీఐ శాఖ సమావేశం స్థానిక 4వ డివిజన్‌లో రాయల వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఉన్న పారిశ్రామిక రంగాన్ని, ఆర్థిక రంగాన్ని గుజరాత్ పెట్టుబడి దారి చేతుల్లో పెట్టి ఆర్థికంగా దేశం దివాలా తీసే విధానాన్ని ప్రధాని నరేంద్రమోదీ అమలు పరుస్తున్నారని విమర్శించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు నగర సమగ్ర అభివృద్ధి కోసం నగరంలో అనేక డివిజన్‌లలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తామన్నారు. అందుకు సీపీఐ నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు (చిన్న) పాల్గొన్నారు.

బార్ కార్యాలయంలో ప్రథమ చికిత్స కిట్ ఏర్పాటు



నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలోని ది గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం ప్రథమ చికిత్స పెట్టెను ఏర్పాటు చేశారు. ఈ పెట్టెను న్యాయవాది నారదాసు వీరమణీంద్ర అందజేశారు. న్యాయవాదులకు ప్రథమ చికిత్స నిమిత్తం ఉపయోగపడనుందని బార్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అన్నారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎ.అనూరాధ, న్యాయవాదులు న్యాయవాది వీరమణీంద్ర, జిలానీ, నూనె పవన్‌తేజ, కట్టా జవహర్‌బాబు, మైలా జాన్, జాబీజ్ పాల్గొన్నారు.

రామాయణంపై ధారావాహిక ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం సంక్షిప్త రామాయణం ధారవాహిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కేవీ కోటేశ్వరరావు ప్రసంగిస్తూ వాల్మీకి పలుకులను శ్రీరాముడు ఆలకించారని అన్నారు. శాంతంగా నీ సందేహాలు తీర్చడం నా కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రభువైన భరతుని ప్రతినిధులమని, మా రాజ్యంలో ధర్మహీనులను దండించే బాధ్యత, హక్కు తమకు ఉన్నాయని చెప్పారు.

ఫ్లెక్సీల ఏర్పాటు వద్ద స్వల్ప వివాదం

పట్నంబజారు: పాతగుంటూరు ఆంజనేయస్వామి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో బుధవారం రాత్రి స్వల్ప వివాదం చోటు చేసుకుంది. జనసేన, టీడీపీ నేతల మధ్య ఫ్లెక్సీ కట్టే విషయంలో వివాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడ నుంచి ఇరువర్గాలను పంపించి వేశారు.

ఇంట్లో చోరీ

పట్నంబజారు: ఇంటి తలుపులు తొలగించి చోరీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.కిరణ్ తెలిపిన వివరాలు.. బ్రాడీపేటలో నివాసం ఉండే ఎం.సీతారామచంద్రమూర్తి ఈనెల 18న కుటుంబంతో కలసి అరుణాచలం వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చారు. వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించారు. లోపలకు వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి అందులోని సుమారు ఐదు సవర్ల బంగారం, పలు వెండి ఆభరణాలు గురుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పట్టాభిపురం పీఎస్‌హెచ్‌ఓ కిరణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజీవ్ గృహకల్పలో వసతులకు చర్యలు

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.శ్రీనివాసులు
- చౌడవరంలో గృహ సముదాయాల పరిశీలన

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని 26వ డివిజన్ నందున్న చౌడవరం గ్రామం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మౌలిక వసతులను కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ చౌడవరంలోని రాజీవ్ గహకల్ప ప్రాంతంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడుతూ గృహకల్ప బ్లాక్‌ల పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రెండు రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డీడీ గ్రౌండ్ వాటర్ వారితో సమన్వయం చేసుకొని, గృహకల్ప సముదాయంలో రెండు ప్రాంతాల్లో బోర్లు వేయడానికి పాయింట్లు గుర్తించి, అంచనాలు సిద్ధం చేయాలన్నారు. అపార్ట్‌మెంట్‌పైన ఉన్న నీటి ట్యాంక్‌లు, వాటిలో ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి, లేనివి, నూతనంగా అవసరమైన వాటి వివరాలతో గురువారానికి నివేదిక ఇవ్వాలని ఏఈని ఆదేశించారు. గృహకల్ప నివాసాలకు ఆస్తి పన్ను వేయడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారిని ఆదేశించారు. చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం జరగాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ని, కార్యదర్శిని ఆదేశించారు. చౌడవరం మెయిన్ రోడ్‌లోని జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్‌పై డ్రెయిన్ నీరు వస్తుందని, సదరు అధికారులతో సమన్వయం చేసుకొని సమస్య పరిష్కారనికి చర్యలు తీసుకోవాలని ఈఈని ఆదేశించారు. ఆయనవెంట ఈఈ కొండారెడ్డి, ఏఈ రవికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీనివాసులు

ప్రత్యేక అవసరాల పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాల పిల్లల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించాలని సమగ్ర శిక్ష గుంటూరు జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం రాజాగారితోటలో నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలోని ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతులైన బాలలకు భారత్ వికాస్ పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో రూ.10 వేలు విలువైన బోధన ఉపకరణాలను అందజేశారు. ఈసందర్భంగా భారత్ వికాస్ పరిషత్ గౌరవాధ్యక్షుడు ఐ. చలపతిరావు మాట్లాడుతూ పుట్టుకతో వివిధ శారీరక, మానసిక వైకల్యంతో బాధ పడుతున్న చిన్నారుల్లో పరివర్తన తీసుకురావడంతో పాటు ఇతర బాలలలో సమానంగా జీవించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు శిక్షణ అందించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి టీఎన్ రాజశేఖర్, సభ్యులు బి.మల్లికార్జునరావు, రఘువీర్, ఎస్వీ రమణ, రవిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురుబ్రహ్మం, ఉపాధ్యాయులు గాడిపర్తి శ్రీధర్, భారతి పాల్గొన్నారు.



బోధన ఉపకరణాలు అందజేస్తున్న భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

ఇన్‌టాక్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో బుధవారం ఇన్‌టాక్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌టాక్ గుంటూరు జిల్లా కో–కన్వీనర్ ఏ.రవి శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ చారిత్రక పురాతన కట్టడాల ప్రత్యేకత, వాటి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు, పురాతన జీవన విధాన ఔన్నత్యాన్ని భావి తరాలకు తెలియజేసే విధంగా ఇన్‌టాక్ సంస్థ పని చేస్తోందని తెలిపారు. ఈసందర్భంగా గుంటూరు నగరంలోని వివిధ పాఠశాలల నుంచి పోటీ పడిన విద్యార్థి బృందాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌టాక్ సంస్థ సభ్యులు అడపా వేణుగోపాల్, యువ ఆర్కియాలజిస్ట్ శ్రీనాథ్ రెడ్డి, సభ్యులు పిచ్చిరెడ్డి, జూటూరి సాయి పాల్గొన్నారు.

కేఎల్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి క్విజ్ పోటీలో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య తెలిపారు. జేకేసీ కళాశాలరోడ్డులోని కేఎల్పీ స్కూల్లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రత్తయ్య మాట్లాడుతూ ఇన్‌టాక్ సంస్థ భారతీయ విద్యాభవన్‌లో భారతదేశ వారసత్వ సంస్కృతి, సంప్రదాయాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నగరంలోని 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీపడినట్లు తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షలో గెలుపొందిన కేఎల్పీ స్కూల్ విద్యార్థుల బృందం ద్వితీయ, తృతీయ రౌండ్లను అధిగమించి ప్రథమస్థానంలో నిలిచారని వివరించారు. పి.రిషి సాత్విక, జె. సాత్విక్ వర్మ జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు రూ.వెయ్యి నగదు గెలుపొందారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఏవో కె. వెంకట్రావు అభినందించారు.



క్విజ్ పోటీల విజేతలతో నిర్వాహకులు

మహిళా ఉద్యోగుల నిరసన ప్రదర్శన



ఎల్ఐసీ మహిళా ఉద్యోగుల ప్రదర్శన



బ్యాంక్ మహిళా ఉద్యోగులు..

లక్ష్మీపురం: కోల్‌కతా దుర్ఘటనను నిరసిస్తూ ఎల్ఐసీ ఉద్యోగులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక అమరావతి రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద మహిళా ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలపై పలు చోట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను ఖండిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ మహిళా ఉద్యోగుల సమన్వయ కమిటీ, మచిలీపటన్ం డివిజన్ కన్వీనర్ సి.హెచ్.మధుబాల మాట్లాడుతూ ఇలాంటి దుర్మార్గమైన, హేయమైన ఈ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీడీఎస్ వి.వాణీ కుమారి, టి.అనసూయరాణి, ఎంఎస్ఎల్ వి.భార్గవి, జి.కామేశ్వరి, డి.సుమ, అరవింద, ఆర్.వి.ఎస్. శ్రీనివాస్, డి.సైదులు, ఐ.వెంకట్రావు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

కొరిటెపాడు(గుంటూరు): కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్యకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గుంటూరు బ్యాంకు మహిళా ఉద్యగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానిక కొరిటెపాడులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి వద్ద నుంచి లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా నిలబడి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం నాయకులు సయ్యద్ బాషా, రవిచంద్రారెడ్డి, మురళి, పృథ్వీ, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పట్నంబజారు: వివాహిత అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. ఒడిశాకు చెందిన బహుదూషా దీక్షతో సంగ్రామ్‌కుమార్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. దీక్ష చెవిటి, మూగ దివ్యాంగురాలు. ఈక్రమంలో బుధవారం భర్త సంగ్రామ్‌కుమార్, అత్త ఉషా కుమారి బయటకు వెళ్లి వచ్చేసరికి దీక్ష కనబడలేదు. ఉషాకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.